# నమస్తే తెలంగాణ
# ఖమ్మం
3 ఖమ్మం, ఆదివారం 2 జూన్ 2024 KHAMMAM


## అమరవీరులకు జిల్లా నేతల నివాళి



హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద శనివారం రాత్రి జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

# పంట ఎటువాయె..

- దొడ్డు వడ్లు దిగుబడి ఉన్నా కొనుగోళ్లు లేవు..
- గతేడాదికి ఈ యాసంగికి భారీ వ్యత్యాసం
- జిల్లాలో ఇప్పటివరకు 13,655 మెట్రిక్‌టన్నులే కొనుగోలు
- సర్కారు కేంద్రాల్లో కఠిన నిబంధనలే కారణమా?
- వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు తప్పాయా..
- చోద్యం చూస్తున్న పౌరసరఫరాలశాఖ



చాతకొండ పంచాయతీలో వరిపంట చేలు వద్ద ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో రైతులు పండించిన దొడ్డు రకం వడ్లు సర్కారు కొనుగోలు కేంద్రాలకు రాకుండాపోయాయి. బయట అధిక రేటు పలికిందా లేక అధికారుల నిర్లక్ష్యమో గాని గతేడాది కంటే ఈ యాసంగి వరిధాన్యం కొనుగోళ్లలో చాలా వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. గత యాసంగిలో కొనుగోలు కేంద్రాల ద్వారా 35,127 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 13,655 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకాని విషయంగా మిగిలింది. రైతులు పంట పండించలేదా అంటే జిల్లావ్యాప్తంగా సన్నాలు, దొడ్డు వడ్లు కలిపి 1,41,020 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ పౌరసరఫరాలశాఖ మాత్రం మాకు అంత అంచనా రాలేదని చెబుతున్నారు. మొత్తంగా సన్నాలు 55,680 మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, దొడ్డు రకాలు 85,340 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ఇంత మొత్తంలో దిగుబడి వస్తే కేవలం 13,655 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పౌరసరఫరాలశాఖ విఫలమైందనే చెప్పాలి. పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పిన ప్రకారం చూస్తే వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు పక్కాగా తప్పినట్లే కనిపిస్తున్నది.

### కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలే కారణమా?

ప్రతి ఏటా జిల్లాలో రైతులు అధిక మొత్తంలో పంటలను సాగు చేస్తున్నారు. అదేక్రమంలో ఈ ఏడాది కూడా 61,017 ఎకరాల్లో వరిపంట వేశారు. దీనికిగాను వ్యవసాయశాఖ 1,41,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. దీంతో ప్రభుత్వం 136 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది.. కానీ అందులో 66 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు చేశారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలు, గిట్టుబాటు ధర రైతులకు అందుబాటులో లేకపోవడంతో బయట విక్రయాలకే ప్రాధాన్యత ఇచ్చారు. దీనిపై అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో రైతులు పండించిన పంట దళారుల పాలైంది. అనుమతులు లేకుండా విక్రయాలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని గప్పాలు చెప్పే అధికారులు చోద్యం చూస్తూ ఉండిపోయారు. రైతుల వద్దకే వచ్చి దళారులు వడ్లు కొనుగోలు చేస్తుంటే అధికారులు ఎటుపోయినట్లు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### పౌరసరఫరాలశాఖ ఏం చేస్తున్నట్లు?

రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే పౌరసరఫరాలశాఖ ఏం చేస్తుందని అని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు కేవలం తనిఖీలకే పరిమితంకావడంతో రైతులు దళారులవైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తేమ శాతం, కొనుగోలు కేంద్రాల వద్ద పరదాలు లేకపోవడం, తదితర సరైన సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల రైతులు పక్కదారిపడుతున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయాలు భారీగా తగ్గిపోయాయి. యాసంగి పంటలో మొత్తంగా 13,655 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారంటే ఆశాఖ పనితీరు వేరే చెప్పనక్కర్లేదు. ఇదే కొనసాగితే రానున్నరోజుల్లో రేషన్‌బియ్యం పేద ప్రజలకు అందడం కష్టమే.

### మద్దతు ధర సరిగా లేదు..



రైతు కష్టపడి పంట పండిస్తుంటే.. ప్రభుత్వం మాత్రం గిట్టుబాటు ధర కూడా కల్పించలేకపోతున్నది. ప్రతిసారి రైతులు మోసపోతూనే ఉన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు ఉండవు. అధికారులు పట్టించుకోరు. వడ్లు కొన్నామా లేదా అంతే వారికి కావాల్సింది. రైతులకు 24 గంటల్లో సొమ్ములు పడుతున్నాయా లేదా అనేది పట్టించుకోరు. అలాంటప్పుడు ఎందుకు కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొస్తారు. అందుకే బయట అమ్ముకుంటున్నారు.

– లావుడ్యా సత్యనారాయణ, రైతు, సీతంపేట బంజర

### బాధ్యత గల ఉద్యోగులు ఉండాలి



రైతులకు అవగాహన కల్పించాలి.. సూచనలు చేయాలి. బాధ్యత గల ఉద్యోగులు ఉంటే రైతుల పరిస్థితి అర్థమవుతుంది. ఒక్కోసారి రైతులు కొనుగోలుకేంద్రాల్లో వడ్లు వేసి రెండ్రోజుల వరకు వేచిచూడాల్సిన పరిస్థితి ఉంటున్నది. అలాంటి ఇబ్బందులు ఉండకూడదు. పౌరసరఫరాల శాఖ అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మండే వీరహనుమంతురావు, రైతు, నాయకులగూడెం

### బయట రేటు ఎక్కువగా ఉంది



వరి ధాన్యానికి మార్కెట్‌లో రేటు ఎక్కువగా ఉండడం వల్ల రైతులు వడ్లను బయట అమ్ముకున్నారు. దొడ్డు వరి తక్కువ వేశారు. సన్నాలు ఎక్కువ పండించడం వల్ల కేంద్రాలకు వడ్లు రాలేదు. మా వద్ద ఉన్న లెక్కలు ఇవే. గత ఏడాది కంటే కొనుగోళ్లు తగ్గాయి.

– త్రినాథ్‌బాబు, సివిల్ సప్లై డీఎం

## ప్రజల గుండెల్లో కేసీఆర్ పదిలం

- ప్రతిఒక్కరికీ రాష్ట్ర ఆవిర్భావదిన శుభాకాంక్షలు
- బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు



ఖమ్మం, జూన్ 1 : ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ప్రజల జీవితాల్లో సమూల మార్పును తీసుకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రజల గుండెల్లో ఎల్లప్పుడూ పదిలంగా ఉంటారని బీఆర్‌ఎస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు ఘనంగా జరుగుతున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గత పదేండ్లలో ఎంతో ప్రగతి సాధించుకున్నామని, ప్రతి తెలంగాణ బిడ్డ సగర్వంగా చెప్పుకునేలా రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా కేసీఆర్ చేశారని పేర్కొన్నారు. కష్టపడి సాధించుకొని, అభివృద్ధి చేసుకున్న తెలంగాణను విచ్ఛిన్నం కాకుండా కాపాడుకోవాలని, కేసీఆర్‌కు అండగా నిలవాలని నామా కోరారు.

## ప్రజల ఆకాంక్ష మేరకు పాలన

- ఐదేళ్లలోపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కార్యాచరణ
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 1 : రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సత్యనారాయణపురం గ్రామస్తులు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రధాన సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవడానికి మీరు పడిన కష్టం ఎప్పటికి గుర్తు ఉంటుందన్నారు. మీ కష్టంతోనే పేదలకు మరింత సేవ చేసే పోర్టు పోలియోలు వచ్చాయన్నారు. ఏడాదిలోపు ప్రతి వాడలో సీసీరోడ్ల నిర్మాణంతోపాటు సైడ్ కాల్వల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలోపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పాలేరు నియోజకవర్గంలో మాత్రం మూడేళ్లలోపు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, కళ్లెం వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేవీ చారి, మద్ది మల్లారెడ్డి, సీపీఐ నాయకుడు దండి సురేశ్, వెంపటి రవి తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి సహకార సంఘాల ఎన్నికలు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 1 : రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని వివిధ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 3 మత్స్య, లేబర్ కాంట్రాక్టు 1, కల్లుగీత కార్మిక సంఘాలు 3, ఒక గొర్రెల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన సంఘాల ఎన్నికలను సైతం దశలవారీగా నిర్ణీత గడువులోగా నిర్వహిస్తామని, సంఘాల బాధ్యులు 60 రోజులకు ముందుగానే ఎన్నికల ప్రతిపాదనలు రాష్ట్ర సహకార అధికారికి సమర్పించాలని ఆయన తెలిపారు.

## రామాలయంలో నేడు ప్రత్యేక పూజలు

భద్రాచలం, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరంగికంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం యాగశాలలో సుదర్శన హోమం, మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో సువర్ణ పుష్పార్చన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు ఆంజనేయస్వామి ఆలయం పక్కన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

## న్యాయమూర్తి కొడుకు ఐపీఎస్!

### జిల్లాలో శిక్షణకు వచ్చిన ఐపీఎస్ అధికారి విక్రాంత్‌కుమార్ సింగ్




మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌కుమార్ సింగ్

కొత్తగూడెం క్రైం, జూన్ 1 : ఆ ఇంట్లో నాన్న, అన్నయ్యలు ఇద్దరూ జడ్జీలే. కానీ.. ఆయన మాత్రం ఐపీఎస్ కొలువును ఎంచుకున్నారు. పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ఎంపికై ఐపీఎస్ అధికారి అయ్యారు. సేవే లక్ష్యంగా.. ప్రజా క్షేత్రంలో నిరంతరం పని చేయడమే ధ్యేయంగా పెట్టుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రొబేషనరీ పూర్తి చేసుకోబోతున్న ఐపీఎస్ అధికారి విక్రాంత్‌కుమార్ సింగ్.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన విక్రాంత్‌కుమార్ సింగ్ 2022లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన తండ్రి మహేందర్ సింగ్ జిల్లా జడ్జిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తల్లి మంజులా సింగ్ గృహిణి. విక్రాంత్‌కుమార్ సింగ్ సోదరుడు ప్రశాంత్ సింగ్ బనారస్ సివిల్ జడ్జి(ఎస్‌డీ)గా విధులు నిర్వర్తిస్తున్నారు. బీటెక్ పూర్తి కాగానే 2015లో విక్రాంత్ సింగ్ ఎస్‌బీఐ పీవోగా ఎంపికయ్యారు. 2016 నుంచి రెండుసార్లు సివిల్స్‌కి ప్రయత్నించారు. ఈ క్రమంలోనే 2019 నుంచి 2021 వరకు ఐసీఏఎస్, ఐఏఏఎస్‌లో ఎంపికయ్యాక కూడా పట్టు విడువకుండా మూడోసారి ప్రయత్నించి 2022లో సివిల్స్ రాసి యూపీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందిన తర్వాత ఈ ఏడాది జనవరి 8న ప్రొబేషనరీ విధులు నిర్వర్తించేందుకు జిల్లాకు వచ్చారు. అప్పటి నుంచి మార్చి 3వ తేదీ వరకు కలెక్టర్ అటాచ్‌మెంట్‌లో వివిధ హోదాల్లో పోలీస్‌గా విధులు నిర్వర్తించారు. మార్చి 4 నుంచి మే 25వ తేదీ వరకు విక్రాంత్‌కుమార్ సింగ్ లక్ష్మీదేవిపల్లి ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఏఎస్పీ విధుల్లో ప్రొబేషనరీ కాలపరిమితి పూర్తి చేసుకుని ఈ నెలలో మళ్లీ జాతీయ పోలీస్ అకాడమీకి వెళ్లి శిక్షణ పూర్తి చేసుకుని వచ్చి అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

### మంచి అనుభవాన్నిచ్చింది : విక్రాంత్ సింగ్ ఐపీఎస్

ప్రజాసేవ చేయాలనే సంకల్పం నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది. నేను ఐపీఎస్‌కి ఎంపికయ్యాక నేరుగా ప్రజల్లోనే ఉంటూ విధులు నిర్వర్తించే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు నన్ను ఎంతగానో ప్రోత్సహించడమే కాకుండా సోదర భావంతో పని చేయించారు. నాతో విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బంది సైతం నాకు ఒక గైడ్‌లా వ్యవహరించారు. శిక్షణ పూర్తి చేసుకునేందుకు ఎంతో సహకరించారు. నా ప్రొబేషనరీ కాలపరిమితిలోనే సాధారణ ఎన్నికలు రావడం, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించడం, అందులో భాగంగానే ప్రజలతో మమేకమై పని చేయడం నాకు మంచి అనుభవాన్నిచ్చింది. పూర్తి బాధ్యతలు స్వీకరించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ తక్కువ కాలంలో నాలో నింపుకున్న స్ఫూర్తితో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తా.

## పకడ్బందీగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, జూన్ 1 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఏఆర్వోలకు ఓట్ల లెక్కింపుపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్ చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్‌ల సీల్ తీయాలని, అవసరమైన మెటీరియల్ అన్నింటినీ వారి ఎదుటే నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు ఇంకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, సెల్ ఫోన్ వంటివి తీసుకురావడానికి వీలులేదని చెప్పారు. నల్లగొండలోని దుప్పలపల్లి గోదాములోని 4 హాళ్లలో ఓట్ల లెక్కింపు చేపడుతామని, ఇందుకోసం 96 టేబుళ్లు ఏర్పాటు చేశామని, ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లు ఉంటాయని చెప్పారు. ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు సిబ్బంది కేంద్రం వద్ద హాజరుకావాలని, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి హాల్‌కు అదనపు కలెక్టర్, ఒక ఏఆర్వో ఇంఛార్జిగా ఉంటారని, ఆర్డీవో స్థాయి అధికారులు ఇద్దరు ఉంటారని, 12 టేబుళ్లకు ఒక ఆర్డీవో ఇంఛార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లకు ఇదివరకే శిక్షణ ఇచ్చామని, మరోసారి 3వ తేదీన శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. మొదటి రౌండ్ షిఫ్ట్ డ్యూటీలో ఉన్నవారు, రెండో షిఫ్ట్ ఉద్యోగులు వచ్చిన తర్వాతే బయటకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా టేబులేషన్, ఓట్ల లెక్కింపు, రిపోర్టులు, మొదటి రౌండు కౌంటింగ్ అంశాలపై మాట్లాడారు. ఓట్ల లెక్కింపులో తేడా రాకుండా చూసుకోవాలన్నారు. మూడు రౌండ్ల వరకు పూర్తిస్థాయిలో బండిల్స్ లెక్కిస్తారని, నాలుగో రౌండ్ సైతం ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ అన్నింటినీ కలుపుకొని బ్యాలెట్ పేపర్ లెక్కించాల్సి ఉంటుందని, చెల్లుబాటు ఓట్లు, చెల్లుబాటు కాని ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

### ఓట్ల లెక్కింపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలి..

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో కౌంటింగ్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మొత్తం 96 టేబుళ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంటును అభ్యర్థులు నియమించుకోవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఒక ఏజెంట్ లేదా అభ్యర్థి ఉండవచ్చని తెలిపారు. ఈ నెల 2వ తేదీలోపు ఏజెంట్ల పేర్లు, ఫొటోలు ఇచ్చి ఐడెంటిటీ కార్డులను తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 5న ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, వారి ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ దగ్గర హాజరుకావాలని తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు పెన్సిళ్లు, జెండాలు, పార్టీ గుర్తుల వంటివి ధరించి కౌంటింగ్ కేంద్రంలోకి రాకూడదన్నారు. ఏజెంట్లకు పెన్నులు, పేపర్లను కౌంటింగ్ హాల్లో ఇస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్లను కౌంటింగ్ హాళ్లకు ఇంఛార్జి అధికారులుగా నియమించామని చెప్పారు. అనంతరం కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఏఆర్వోలు నల్లగొండ దుప్పలపల్లి గోదాము వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

## రాష్ట్రావతరణ వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబు



వేడుకలకు ముస్తాబైన కలెక్టర్ కార్యాలయం

మామిళ్లగూడెం, జూన్ 1 : రాష్ట్ర అవతరణ వేడుకలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 2024, జూన్ 2 నాటికి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ వీపీ గౌతమ్ జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌరవ వందనం స్వీకరించిన తర్వాత కలెక్టర్.. పదేళ్లలో జిల్లాలో సాధించిన అభివృద్ధిపై ప్రసంగించనున్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది సంబురాలకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంబంధిత శాఖల అధికారులు కోరారు.








